క్లుప్తంగా

పెదపోలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



పెదపోలమ్మ ఘటాలకు పూజ చేసి, స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో జరుగుతున్న పెదపోలమ్మ సంబరాలకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆరోజు జరిగే పండగకు హాజరు కాలేకపోతున్నానని, అందుకే ఇప్పుడు వచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దాడితల్లి సేవలో ఎమ్మెల్యే



దాడితల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు గొల్లపల్లి దాడితల్లి అమ్మవారిని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం దర్శించుకున్నారు. మే 1, 2, 3వ తేదీల్లో జరగనున్న పండగ నేపథ్యంలో ఆయన అమ్మవారికి ముందస్తుగా పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కూరాకుల వీధిలోని మురుగుకాలువలో పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజాం: పట్టణంలోని సారథి, కూరాకుల వీధి, ఆదినారాయణ కాలనీలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రతీ వార్డులోని మురుగు కాలువల్లోని పూడికలు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం



కూనాయవలసలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు తెలిపారు.

అన్నదానం

మెంటాడ: మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం పురస్కరించుకుని, భక్తులకు సోమవారం అన్నదానం చేశారు. పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 4 వేల మంది భక్తులు కార్యక్రమానికి హాజరై, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఐఓ



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీవీఎం ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సోమవారం పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు, అక్కడ నిర్వహణ సిబ్బందికి ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త దృష్ట్యా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, సుగర్, జ్వరం, ఆయాసం, వికారం, వాంతులు, తలనొప్పి, కడుపునొప్పి, కీళ్ల నొప్పులు, డీహైడ్రేషన్ తదితర అనారోగ్య లక్షణాలకు శిబిరంలో ఏర్పాటు చేసిన మందులను ఆయన పరిశీలించారు. ఈ వైద్య శిబిరాన్ని పలువురు వినియోగించుకున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్



రేగిడిలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- నజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఓటు వేసేందుకు పోటెత్తిన ఓటర్లు
- కట్టుదిట్టంగా శాంతిభద్రతల పర్యవేక్షణ
- సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన పోలింగ్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఓటర్లంతా ఓటేసేందుకు కేంద్రాలకు బారులుతీరారు. ఎంతో ఓపికగా క్యూలైన్లలో నిల్చొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న ఓటర్లు, దివ్యాంగులను కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 4 గంటల నాటికి బొబ్బిలిలో 71.06 శాతం పోలింగ్ నమోదు కాగా, రామభద్రపురంలో 81.60 శాతం, బాడంగిలో 75.81 శాతం, తెర్లాంలో 79.82 శాతం, మెంటాడలో 75.13 శాతం, రాజాంలో 76.82 శాతం, రేగిడిలో 77 శాతం, వంగరలో 72 శాతం, సంతకవిటిలో 72 శాతం పోలింగ్ నమోదైంది.

– సాక్షి నెట్‌వర్క్



ఓటేసినట్లు వేలిని చూపిస్తున్న ఓటర్లు



రామభద్రపురం: చంటిబిడ్డతో ఓటు వేసేందుకు వెళ్తున్న మహిళలు



వంగర: ఓటర్లకు ఓట్ల స్లిప్పులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వంగర: ఓటర్లతో ఎంపీపీ సురేష్ ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు



రామభద్రపురం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్న డీఎస్పీ మోహనరావు



మెంటాడ: ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఓటర్లు



రాజాం: పోలింగ్ కేంద్రానికి బారులుతీరిన ఓటర్లు



రాజాం: ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగుడికి సాయం చేస్తున్న పోలీసులు



తెర్లాం: పోలింగ్ కేంద్రానికి దగ్గరలోని వైఎస్సార్ సీపీ శిబిరంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి



బాడంగి: పోలింగ్ సరళిపై ఆరాతీస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బొబ్బిలి: తన ఓటును బ్యాలెట్ బాక్సులో వేస్తున్న ఓటరు



రాజాంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే జోగులు



బొబ్బిలి: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సిబ్బంది



బొబ్బిలి: అధికారులకు సూచనలిస్తున్న జేసీ మయూర్ అశోక్



రాజాం సిటీ: శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్న సీఐ రవికుమార్



సంతకవిటి: పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న అధికారులు



రాజాం: వైఎస్సార్ సీపీ శిబిరంలో ఎన్నికల సరళిపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే జోగులు

బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు



బొబ్బిలి రైల్వేస్టేషన్

- నరికొత్తగా రూపుదిద్దుకోనున్న బొబ్బిలి రైల్వేస్టేషన్
- ఆధునీకరణకు కేంద్రం నుంచి నిధులు మంజూరు
- కొత్త బ్రిడ్జి, లిఫ్ట్, ఎస్కలేటర్, కొత్త భవనం నిర్మాణం



కొత్తగా నిర్మిస్తున్న రైల్వే కార్యాలయ భవనం



పెరగనున్న ప్లాట్‌ఫాంల సంఖ్య ఇవే..



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల ఫుట్ ఓవర్ బ్రిడ్జి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి రైల్వేస్టేషన్ ఆధునిక హంగులతో రూపుదిద్దుకోనుంది. కేంద్రం నుంచి మంజూరైన కొన్ని రూ.కోట్ల నిధులతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వేస్టేషన్ కార్యాలయ భవనం కొత్తగా నిర్మిస్తున్న భవనంలోకి మార్చనున్నారు. ఇప్పుడున్న ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం మూడో నంబర్ ప్లాట్‌ఫాంగా మారుస్తారు. రెండో నంబర్ ప్లాట్‌ఫాంను అలాగే ఉంచి, కొత్తగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జి స్థానంలోనే కొత్త బ్రిడ్జి, లిఫ్ట్, ఎస్కలేటర్, రిజర్వేషన్ కౌంటర్ నిర్మాణాలు చేపడతారు. ఏడాదిన్నర కాలంలో పనులు పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వందే భారత్ రైలు సైతం నడిచేలా ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, స్థానికుల హామీలు కొన్ని ఉన్నాయని, అవి నెరవేరితే ప్రయాణికులకు రైల్వే యంత్రాంగం మెరుగైన సేవలందించినట్లేనని అంతా భావిస్తున్నారు.

స్థానికుల డిమాండ్లు..

- రిజర్వేషన్ సమయం మరింత పెంచాలి
- తత్కాల్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి
- విజయనగరం నుంచి బొబ్బిలి, రాయగడ షటిల్ ట్రైన్లు నడపాలి
- లేదా విజయనగరం–సాలూరు షటిల్ ట్రైన్లు నడపాలి
- రైల్వే బస్సులను సాలూరు–బొబ్బిలి మధ్య నడపాలి
- ప్లాట్‌ఫాంల వద్ద మరుగుదొడ్లు నిర్మించాలి
- బొబ్బిలిలో టాటా–యశ్వంతపూర్, హతియా–యశ్వంతపూర్ ట్రైన్లు నిలపాలి

ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతాం..



బొబ్బిలి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తి చేసి, ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తయారు చేస్తాం. ఇప్పటికే కొన్ని పనులు జరుగుతున్నాయి. స్థానికులు కూడా కొన్ని సమస్యలు పరిష్కరించాలని నా దృష్టికి తీసుకువచ్చారు. వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– అనూప్‌కుమార్ శతృతి, డీఆర్‌ఎం, విశాఖపట్టణం

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆకుల రాజు

పార్వతీపురం టౌన్: ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు విద్యార్థులకు అవసరమైన తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయం ఏర్పాట్లు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులంతా బెంచీలపైన కూర్చుని రాసే విధంగా ఫర్నిచర్‌ను సిద్ధం చేశామని, సుమారు 26 రూములు పరీక్షలకు వినియోగించనుండగా అన్ని రూములు, వరండాలు, బహిరంగ ప్రదేశాలతో కలిపి 36 సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించనున్నామని చెప్పారు. ఈ సీసీ కెమెరాల వీడియోలను ఇంటర్మీడియట్ బోర్డు నేరుగా హెడ్ ఆఫీస్ నుంచి లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పర్యవేక్షిస్తుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు, సిబ్బంది మొబైల్‌ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. ఒక్క నిమిషం ఆలస్యాన్ని కూడా ఇంటర్ బోర్డు అనుమతించబోదని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయం



రామభద్రపురం: మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు జోష్యం చెప్పారు. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఓటరు స్లిప్పుల పంపిణీ శిబిరాన్ని సోమవారం పరిశీలించిన వారు పోలింగ్ జరుగుతున్న తీరును ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వారు పోలింగ్ సరళిని పరిశీలిస్తే సీతారాం గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, కనిమెరక అప్పారావు, చొక్కాపు శ్రీనివాసరావు, నాగిరెడ్డి కామేశ్వరరావు, చింతల ఉమామహేశ్వరరావు, కనిమెరక శ్రీనివాసరావు, పెంకి శేఖర్, పువ్వల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: వైఎస్సార్ సీపీ శిబిరం వద్ద ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ శిబిరాలను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల జరుగుతున్న తీరు, పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ప్రజాసంక్షేమానికే ప్రజలు పట్టంగడతారని, ప్రజల బాగోగుల కోసం పరితపించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కే ఓటర్లు ఓటు వేశారని, ఆయన గెలుపు ఖాయమన్నారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన



రైతులకు విత్తనగుళికల తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో విత్తనగుళికల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ సీహెచ్ శారద, గౌరీశ్వరరావు, పార్వతమ్మ విత్తనగుళికల తయారీని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. తొమ్మిది రకాలైన విత్తనగుళికల తయారీకి ముందు బీజామృతంతో విత్తన శుద్ధిచేసి, తర్వాత బంకమట్టి, ఘనజీవామృతం, బూడిద, సరిపడ నీరు, ఒకదాని తర్వాత ఒకటి వేసి నానబెట్టాలి. ఇలా చేసిన విత్తనాలను పొలంలో జల్లుకుంటే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారికి వెంటనే వైద్యసేవలు అందేలా ఈ శిబిరం ఏర్పాటు చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు తెలిపారు.



శిబిరంలో వైద్య సిబ్బంది